క్లుప్తంగా

సచివాలయం తనిఖీ

సోమశిల: అనంతసాగరం మండలం కొత్తపల్లి గ్రామంలోని సచివాలయాన్ని ఎంపీడీఓ ఎ.మధుసూదన్‌రావు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగస్తులు, గ్రామ వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం వేగవంతంగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జునైద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లింగంగుంటలో 'గడప గడపకు..'

సోమశిల: అనంతసాగరం మండలం లింగంగుంట సచివాలయం పరిధిలో శుక్రవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.మధుసూదన్‌రావు, జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, సచివాలయ మండల కన్వీనర్ అక్కల రెడ్డి అంకిరెడ్డి గురువారం తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మండలంలోని అధికారులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని నేతలు కోరారు.

మినుము పంట పరిశీలన



మినుము పంటను పరిశీలిస్తున్న అధికారులు

కలిగిరి: మండలంలోని వెలగపాడు, జిర్రావారి పాళెం గ్రామాల్లో సాగులో ఉన్న మినుము పంటను జిల్లా వ్యవసాయశాఖ అధికారి జి.సుధాకరరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అధికారులతో మాట్లాడుతూ రెండు నెలల క్రితం వేసిన మినుము పంట వర్షాభావంతో ఎండిపోతోందన్నారు. మరో వారం రోజుల్లో వర్షం కురవకపోతే కలిగిరి మండలంలో ప్రస్తుతం సాగులో ఉన్న 350 హెక్టార్లలోని మినుము పంట పూర్తిగా దెబ్బతింటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సంచాలకుడు నర్సోజీ రావు, మండల వ్యవసాయాధికారి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



నూతన ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

కలిగిరి: కలిగిరి ఎంపీడీఓగా జి.వెంకటేశ్వర్లు గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మనుబోలు ఎంపీడీఓగా ఉన్న ఆయన బదిలీపై కలిగిరికి వచ్చారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కలిగిరి ఎంపీడీఓగా ఆయన విధులు నిర్వర్తించారు. ఇప్పటి వరకు కలిగిరి ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహించిన కళాధరరావు జలదంకి మండలం ఈఓపీఆర్డీగా బదిలీపై వెళ్లారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందించేందుకు బట్టేపాడులో కుంటా పెంచలమ్మ నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శి బొటిక నరసింహులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 4,614 మంది వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు రూ.1.28 కోట్ల పింఛన్ నగదును గురువారం పంపిణీ చేసినట్లు ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలో 5,010 మంది పింఛన్ కానుక లబ్ధిదారులు ఉండగా, ఇప్పటి వరకు 92.18 శాతం మందికి పింఛన్ నగదును అందజేసినట్లు తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి లేదా వివిధ కారణాల వల్ల బంధువుల ఇళ్లలో ఉంటున్న లబ్ధిదారులకు వలంటీర్లు ఆయా ప్రాంతాలకు వెళ్లి పింఛన్లు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయండి

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కావలి డిప్యూటీ ఈఓ రఘురామయ్య తెలిపారు. గురువారం ఆయన మండలంలోని కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల బోధనను, అకడమిక్, నాన్ అకడమిక్ కార్యకలాపాలను, పాఠశాల అభివృద్ధికి తీసుకున్న చర్యల గురించి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయుడు శివరామిరెడ్డి, అంజయ్య, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరపురాని నేత గౌతమ్‌రెడ్డి



చేజర్ల: మండల పరిషత్ కార్యాలయంలో..



సంగం: ఎంజీఆర్ సంగం బ్యారేజ్ వద్ద..



మర్రిపాడు మండలం రాంపల్లిలో..



మర్రిపాడు మండలం చిలకపాడులో..

• ఎంజీఆర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, నేతల ఘన నివాళి

ఆత్మకూరురూరల్: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, ప్రజల అభిమానాన్ని చూరగొన్న ఆయన మరపురాని నేతగా నిలిచిపోయారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. గురువారం గౌతమ్‌రెడ్డి జయంతి సందర్భంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం కూడలిలో ఆయన విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. గౌతమ్‌రెడ్డి సోదరుడు, స్థానిక ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, తనయుడు మేకపాటి కృష్ణార్జున్‌రెడ్డి వేర్వేరుగా గౌతమ్‌రెడ్డి విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, కౌన్సిలర్లు కొప్పోలు రమాదేవి, తోకల తిరుపతమ్మ, శివకోటా రెడ్డి, రాజశేఖర్, రాధిక, చెరుకూరి కామాక్షయ్యనాయుడు, నాయకులు ముజ్జు, జమీర్, కొండా వెంకటేశ్వర్లు, చెరుకూరు శ్రీనివాసులునాయుడు, బొమ్మిరెడ్డి రవి, తోకల వెంకటేశ్వర్లు, కేతా రవీంద్రారెడ్డి, ఒంటెద్దు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు పట్టణంలో..

గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని గురువారం ఆత్మకూరు పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. పట్టణంలోని ఎంజీఆర్ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న గౌతమ్‌రెడ్డి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారపు వెంకటరమణమ్మ తదితరుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎస్‌వీపీ వైద్యశాల ఎండీ డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్, కౌన్సిలర్లు పొడమేకల పెంచలయ్య, కొండా స్వరూపరాణి, మహబూబ్‌బాషా, నాయకులు కొండా వెంకటేశ్వర్లు, కొప్పోలు వెంకటేశ్వర్లు, బాల అంకయ్య, జయపాల్‌రెడ్డి, జమ్రు, అబ్దుల్లా, యాసిన్, పీర్ల శ్రీనివాసులు, వల్లెపు వెంకటేశ్వర్లు, బంకా వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఆర్ సంగం బ్యారేజ్ వద్ద..

సంగం: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక ఎంజీఆర్ సంగం బ్యారేజ్ వద్దనున్న ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు కంటాబత్తిన రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా మేకపాటి గౌతమ్‌రెడ్డి ఎనలేని సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. గౌతమ్‌రెడ్డి ఆశయసాధనే లక్ష్యంగా ఆయన సోదరుడు, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మానికల చందు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫణికుమార్‌రెడ్డి, రాచకూటి రమేష్, రవీంద్రబాబు, అనిల్, రామారావు, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు మండలంలో..

మర్రిపాడు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి సందర్భంగా గురువారం మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘన నివాళులర్పించారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి గౌతమ్‌రెడ్డి చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో నాయకుడు శ్రీనివాసులు రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చిలకపాడు గ్రామంలో జేసీఎస్ మండల కన్వీనర్ సిద్దంరెడ్డి మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో గౌతమ్‌రెడ్డికి ఘన నివాళులర్పించారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

చేజర్ల: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి సందర్భంగా గురువారం చేజర్లలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు ఘన నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, వైస్ ఎంపీపీ వేలూరు తిరుపతినాయుడు, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులునాయుడు, నోటి సుందరరామిరెడ్డి, తిరుపతినాయుడు, వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణ, రామచంద్రయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్: నెల్లూరుపాళెం కూడలిలో గౌతమ్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తదితరులు



ఆత్మకూరురూరల్: తండ్రి గౌతమ్‌రెడ్డి విగ్రహం వద్ద కృష్ణార్జునరెడ్డి తదితరులు



ఆత్మకూరురూరల్: ఎంజీఆర్ బస్టాండ్ వద్ద గౌతమ్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న నేతలు



ఉదయగిరి: భోజన ప్యాకెట్లు అందజేస్తున్న ఓబుల్‌రెడ్డి తదితరులు

అన్నదానం

ఉదయగిరి: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి సందర్భంగా గురువారం స్థానిక చిల్డ్రన్ హోంలోని 60 మంది చిన్నారులకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి భోజన ప్యాకెట్లు, పండ్లు, మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్కినేని ప్రవీణకుమారి, దాసరపల్లి సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోగుల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.శ్రీనివాసులురెడ్డి, జి.ఓబుల్‌రెడ్డి, నారపరెడ్డి, ఇస్మాయిల్, గురవయ్య, ఇత్తడి రమణయ్య, చినబాలిరెడ్డి పాల్గొన్నారు.

శనగ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో శనగ విత్తనాలు కావాల్సిన రైతులు సచివాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు టి.చెన్నారెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఏడీఏ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శనగ సాగు చేసే రైతులకు ప్రభుత్వం జేజీ–11 కాగ్–2 రకం విత్తనాలు 40 శాతం సబ్సిడీపై అందిస్తోందని తెలిపారు. ఆయా మండలాల్లో ఇప్పటి వరకు 550 క్వింటాళ్ల విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. మిగిలిన రైతులు కూడా త్వరితగతిన పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట వ్యవసాయాధికారులు ఆంజనేయులునాయక్, వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

నేడు ఉదయగిరిలో జాబ్‌మేళా

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆల్ఫా మెరైన్ కొడక్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బలక్షమ్మ, వైస్ ప్రిన్సిపల్ ఎ.నరసింహులు, ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్లు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన వారు, చివరి సంవత్సరం చదువుతున్న వారు ఉద్యోగాలు పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, ఫొటోతో జాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు.

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పర్యటన

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల్లో పర్యటిస్తారని ఎమ్మెల్యే మేకపాటి కార్యాలయం ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు అనుమసముద్రంపేటలో ఎన్‌డీసీసీ బ్యాంక్ భవనాలు ప్రారంభిస్తారని తెలిపారు. శనివారం ఉదయం ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. ఆత్మకూరు మండలం బోయలచిరివెళ్లలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం భవనాలను ఉదయం 11.30 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అనంతసాగరం మండలం గార్లదిన్నెపాడు, ఇనగలూరు గ్రామాల్లో జరిగే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

• ఎంపీపీ మూలె పద్మజ



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజ

ఉదయగిరి: అధికారులు, ప్రజాప్రతినిధులు ఉదయగిరి మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ మూలె పద్మజ పేర్కొన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అవసరమైన పనులు చేపట్టేందుకు త్వరితగతిన ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. వర్షాలు తక్కువగా ఉన్నందున గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల వెంట పెరిగిన కంపచెట్లను తొలగించాలని తెలిపారు. కాగా పలువురు సర్పంచ్‌లు వారి గ్రామ పంచాయతీల్లోని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అనంతరం పలు శాఖల అధికారులు ఆయా శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మోది రామాంజనేయులు, వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లక్ష్మణ్‌నాయక్, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాని, సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాముల రమణయ్య, నాయకులు మూలె సుబ్బారెడ్డి, ఎస్దాని, అక్కుల్‌రెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గౌడ సంఘం నేతల చేయూత



నగదు అందజేస్తున్న నాయకులు

సోమశిల: అనంతసాగరం మండలం లింగంగుంట గ్రామంలో పెద్ద కొండయ్యగౌడ్‌కు గురువారం గౌడ సంఘం నాయకులు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్టు మీద నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన వారి కుటుంబసభ్యులకు రూ.20 వేలు, గాయపడిన వారికి రూ.10 వేల చొప్పున గౌడ సంఘం తరఫున అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్, కామేశ్వరయ్యగౌడ్, దాసరి హజరత్తయ్యగౌడ్, నరసయ్యగౌడ్, మల్లికార్జునగౌడ్, రాజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రవీణ్‌కుమార్

కొండాపురం: 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఉదయగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.రాజారమేష్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గురువారం బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతిచెందిన, శాశ్వతంగా గ్రామాల నుంచి వెళ్లిపోయిన, పెళ్లి చేసుకుని వెళ్లిపోయిన వారి ఓటును ఫాం–7 ద్వారా తొలగించాలని తెలిపారు. ఫాం–8 ద్వారా ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరొక పోలింగ్ కేంద్రానికి ఓటును మార్చుకోవచ్చని తెలిపారు. ఈ నెల 4, 5 తేదీల్లో, డిసెంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతి బీఎల్వో తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ కోటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

వరికుంటపాడు: మండలంలో పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ ఈఈ రంగవరప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని వరికుంటపాడు ఎస్టీకాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను, తూర్పు చెన్నంపల్లిలో జగనన్న లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లిస్తోందని తెలిపారు. అలాగే జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. ఆయన వెంట ఏఈ ఎఫ్రాయమ్, ఇంజినీరింగ్ సహాయకుడు సుదీర్ ఉన్నారు.

ఆరోగ్య భద్రతకు భరోసా



సురక్ష కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

కావలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్య భద్రతకు భరోసాగా నిలిచిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. కావలిలోని మద్దూరుపాడు ఒకటో వార్డు పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉద్దేశాన్ని, పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు నిధుల మంజూరు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలో వెలసిన శ్రీగుహమల్లేశ్వర మల్లికార్జునస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణ పనులకు రూ.36 లక్షల నిధులు మంజూరైన నేపథ్యంలో గురువారం జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో చేయాల్సిన పనుల గురించి దేవాలయ కమిటీతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ ఇంజినీర్ తపతి మాట్లాడుతూ ఆలయంలో మహాకుంభాభిషేకం నిర్వహించాలని జిల్లా అధికారులు నిర్ణయించిన నేపథ్యంలో ఆలయ జీర్ణోద్ధరణ పనులకు తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే నల్లగొండ సీతారామ దేవాలయ జీర్ణోద్ధరణ పనులకు కూడా తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా రూ.కోటి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నల్లగొండ బీసీకాలనీలో రామాలయం నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేయగా అందుకు సంబంధించిన పనులు ప్రారంభించారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, ఈఓ మల్లికార్జున్‌రెడ్డి, ఎఫ్‌సీఏ మాజీ డైరెక్టర్ గుండెమడగల ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలతోపాటు పాలనాపరంగా ఎదురవుతున్న సమస్యలపై దృష్టి సారించి త్వరలోనే పరిష్కరిస్తామని స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం కూడలిలో గురువారం కౌన్సిలర్లు, పలు వార్డుల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మున్సిపల్ కార్యాలయంలో కొందరు అధికారుల ద్వారా ఎదురవుతున్న ఇబ్బందులను కౌన్సిలర్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండానే జరుగుతున్న పనులు, వాటి వల్ల తలెత్తే ఇబ్బందులను వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సర్వే పరీక్షకు సర్వం సిద్ధం



ప్రశ్నపత్రాలను అందజేస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం నిర్వహించే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ మస్తాన్‌వలి గురువారం తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను సీఆర్‌ఎంటీ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎంపిక చేసిన 25 పాఠశాలల్లో 3, 6, 9 తరగతులకు సంబంధించి 767 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలకులుగా డిగ్రీ కళాశాల చివరి సంవత్సరం చదువుతున్న 40 మంది విద్యార్థులను నియమించామని తెలిపారు.

ప్రశ్నపత్రాల పంపిణీ

సోమశిల: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాలను అనంతసాగరంలోని మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం ఎంఈఓలు ఎం.బాలకృష్ణారెడ్డి, కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సీఆర్‌పీలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిక చేసిన పాఠశాలల్లోని విద్యార్థులకు శుక్రవారం సర్వే పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నరసింహులు, మహబూబ్‌బాషా, మాధవ్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు దారితీసిన వివాదం

• విచారణకు బంధువుల డిమాండ్



రౌతు వినయ్ (ఫైల్)



విలేకరులతో మాట్లాడుతున్న సుమతి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు పట్టణంలో మోటారు బైక్ మెకానిక్‌ల మధ్య గత నెల 23వ తేదీ రాత్రి జరిగిన వివాదం రౌతు వినయ్ (16) అనే యువకుడి ఆత్మహత్యకు దారితీసినట్లు తెలిసింది. మృతుడి పిన్ని సుమతి గురువారం ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడుతూ నిష్కారణంగా తమ బిడ్డ చావుకు కారణమైన వ్యక్తులపై పోలీసు కేసు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. 23వ తేదీ రాత్రి వినయ్‌పై ఉమర్ షరీఫ్, మున్నా, షబ్బీర్ తదితరులు దాడి చేసిన వీడియోలను విలేకరులకు అందజేశారు. బుచ్చిరెడ్డిపాళెంలో నివాసం ఉంటున్న తన అక్క కుమారుడు వినయ్ రెండేళ్లుగా ఆత్మకూరులోని ఒక బైక్ మెకానిక్ షాపులో పనిచేస్తున్నాడని సుమతి తెలిపారు. ఎదురుగా ఉన్న మరో మెకానిక్ షాపు వద్ద బ్యాటరీ వైర్లు కత్తిరించారనే విషయమై ఉమర్ షరీఫ్, షబ్బీర్, మున్నా తదితరులు వినయ్‌పై విచక్షణా రహితంగా దాడి చేశారని తెలిపారు. ఇదే విషయమై పోలీసుస్టేషన్ వద్ద ఇరువర్గాలకు రాజీ చర్చలు నడిచాయని, దాడి చేసిన వారే వినయ్‌పై మళ్లీ దాడి చేస్తామని చెబుతుండడంతో బుచ్చిరెడ్డిపాళెంలోని తన తల్లి వద్దకు పంపామని తెలిపారు. తాను తప్పు చేయకపోయినా అందరూ కలిసి తనపై దాడి చేశారని తల్లికి తెలిపిన వినయ్ అదే రోజు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఇదే విషయంపై ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా వినయ్ మృతిచెందినది బుచ్చిరెడ్డిపాళెంలో కనుక అక్కడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయమని చెప్పారని, స్థానిక పోలీసులు తమకు న్యాయం చేయకపోతే ఎస్పీని కలుస్తామని ఆమె తెలిపారు.